క్లుప్తంగా

సింగపూర్‌లో సీఎంను కలిసిన పారిశ్రామికవేత్త



పాలకుర్తి టౌన్: సింగపూర్ పర్యటనలో ఉన్న సీఎం రేవంత్‌రెడ్డిని పాలకుర్తికి చెందిన ఐటీ పారిశ్రామికవేత్త రాపోలు నాగానంద్, లావణ్య దంపతులు సోమవారం మర్యాదపూర్వకంగా కలిశారు. సింగపూర్‌లోని మెరీనా బేసాండ్స్ హోటల్‌లో సీఎంకు పుష్పగుచ్ఛం అందించి స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఐటీ అభివృద్ధికి తెలంగాణలో చేపట్టాల్సిన చర్యలపై సీఎం అడిగి తెలుసుకున్నారు. ఎన్‌ఆర్‌ఐలు స్వరాష్ట్ర అభివృద్ధికి సహకారం అందించాలని, పుట్టిన గడ్డకు చేయుతా అందించడంతో ఎన్‌ఆర్‌ఐల తోడ్పాటు అభినందనీయమని సీఎం తెలిపారు.

'కిసాన్ మహిళా పొదుపు సంఘంలో అక్రమాలు'



రఘునాథపల్లి: కిసాన్ మహిళా వ్యవసాయ ఉత్పత్తిదారుల సహాయ సహకార సంఘంలో అక్రమాలు జరిగాయి.. బాధ్యులపై చర్య తీసుకోవాలని సంఘం ప్రతినిధులు సోమవారం కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. పలు మండలాలకు చెందిన పేద మహిళా రైతులు 2019 జూలై 8న కిసాన్ మహిళా పొదుపు సంఘంలో చేరి రూ.2,94,500 వాటా ధనం సమకూర్చుకున్నామన్నారు. ఇందుకు సీడ్ గ్రాంట్ సెర్ప్ నుంచి రూ.25 లక్షలు మంజూరయ్యాయి. నాటి నుంచి సంఘంలో జరిగిన రూ.27,94,500 ఆర్థిక లావాదేవీలపై తమకు ఎలాంటి వివరాలు తెలియడం లేదని ఫిర్యాదులో పేర్కొన్నారు. గత నెల 30న గ్రీవెన్స్‌లో వినతిపత్రం అందజేసినా ఇప్పటివరకు స్పందన లేదని చెప్పారు. అవకతవకలపై సెర్ప్ సీఈఓకు కూడా వినతిపత్రం అందజేశామని తెలిపారు. విచారణ చేపట్టాలని కోరారు.

గైని విజయకు అవార్డు



జనగామ రూరల్: సౌత్ ఇండియా ఉమెన్స్ ఇన్స్పిరేషన్ అవార్డును జనగామకు చెందిన గైని విజయ అందుకున్నారు. హైదరాబాద్ బిర్లా ఆడిటోరియంలో ఆదివారం శారద ఎడ్యుకేషనల్ సొసైటీ ఆధ్వర్యంలో వివిధ రంగాల్లో ఆదర్శంగా నిలిచిన మహిళలను సత్కరించారు. మహిళలు, విద్యార్థినుల సాధికారత కోసం 15 ఏళ్లుగా కృషి చేస్తున్న కొడకండ్ల మండలం ఏడనూతుల ఉన్నత పాఠశాల సాంఘిక శాస్త్ర ఉపాధ్యాయురాలు విజయను సినీ నటి కవిత సౌత్ ఇండియా ఉమెన్స్ ఇన్స్పిరేషన్–2025 అవార్డుతో సత్కరించారు. ఈ సందర్భంగా విజయ మాట్లాడుతూ కుటుంబ సభ్యులు సహాయ సహకారాలు అందించినట్లయితే పురుషులతో సమానంగా మహిళలు అన్ని రంగాల్లో రాణిస్తారని తెలిపారు.

బీఆర్‌ఎస్ గ్రామ కమిటీ ఎన్నిక



బచ్చన్నపేట: మండలంలోని లింగంపల్లి బీఆర్‌ఎస్ గ్రామ నూతన కమిటీని సోమవారం ఎన్నుకున్నారు. గ్రామ అధ్యక్షుడిగా మద్దికుంట రాజిరెడ్డి, ఉపాధ్యక్షుడిగా జంగా నరేష్, ప్రధాన కార్యదర్శిగా బాల్‌రెడ్డి, కోశాధికారిగా బాలకనుకయ్య ఎన్నికయ్యారు. కార్యక్రమంలో పీఏసీఎస్ వైస్ చైర్‌పర్సన్ మద్దికుంట రాధ, మాజీ సర్పంచ్, ఉప సర్పంచ్ కుందెన మల్లేశం, భాస్కర్, కిష్టయ్య, ముత్యంరెడ్డి, బిక్షపతి, శ్రీశైలం, నవీన్, యాదగిరి పాల్గొన్నారు.

శ్రీనగర్‌కాలనీ నూతన కమిటీ..

జనగామ రూరల్: పట్టణంలోని శ్రీనగర్ కాలనీ ప్రస్తుత అధ్యక్షుడు నారోజు శ్రీనివాస్‌చారి ఆధ్వర్యంలో సోమవారం నూతన కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా గూడ రాజుబోస్, ప్రధాన కార్యదర్శిగా మాశెట్టి గణేష్, ఉపాధ్యక్షులుగా నరేంద్ర చారి, నర్సింహారెడ్డి, సహాయ కార్యదర్శిగా వెంకటాద్రి, గౌరవ అధ్యక్షుడిగా శ్రీనివాస్‌రెడ్డి ఎన్నికయ్యారు. కాసుల శ్రీనివాస్, కాలనీ సభ్యులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి పోటీల్లో యువకుడి ప్రతిభ



రఘునాథపల్లి: కరీంనగర్‌లో ఇటీవల జరిగిన రాష్ట్రస్థాయి 46వ జూనియర్ హ్యాండ్‌బాల్ పోటీల్లో కోమల్ల గ్రామానికి చెందిన తాటికొండ వేణుయాదవ్ ప్రతిభ చాటాడు. వేణుయాదవ్ జట్టు ద్వితీయ బహుమతి గెలుచుకుంది. ఈ సందర్భంగా అతడిని సోమవారం పలువురు గ్రామస్తులు అభినందించారు.

అసంపూర్తిగా విద్యావనరుల భవనం

- పనులు పూర్తిచేయాలని కోరుతున్న విద్యార్థుల తల్లిదండ్రులు

తరిగొప్పుల: ప్రభుత్వ పాఠశాల అభివృద్ధి కోసం రాష్ట్ర ప్రభుత్వం 'మన ఊరు–మన బడి' కార్యక్రమాన్ని చేపట్టింది. రూ.కోట్ల నిధులు వెచ్చించి ప్రభుత్వ పాఠశాలలో మౌలిక వసతుల కల్పనే లక్ష్యంగా ముందుకు సాగుతోంది. అధికారుల అలసత్వం, పాలకుల నిర్లక్ష్యం కారణంగా మండల పరిధిలో మన ఊరు– మనబడిలో భాగంగా చేపట్టిన పనులు అసంపూర్తిగా మిగిలాయి. మండలకేంద్రంలోని జిల్లా ప్రజా పరిషత్ సెకండరీ పాఠశాలలో చేపట్టిన మండల విద్యా వనరుల కేంద్రం భవన నిర్మాణ పనులు అసంపూర్తిగా మిగిలాయి. నిధుల లేమి కారణంగా పనులు అర్థాంతరంగా ఆగిపోయాయి. దీంతో ఎంఆర్సీ భవనం ఏకంగా గొర్రెల పాకగా మారింది. ఇప్పటికైనా అధికారులు, పాలకులు చొరవతీసుకుని అసంపూర్తిగా ఉన్న నిర్మాణ పనులు పూర్తిచేయాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.



అసంపూర్తిగా ఉన్న ఎంఆర్సీ భవనం

నిధులు విడుదల చేయాలి



నిధుల లేమి కారణంగా మండల విద్యావనరుల కేంద్రం భవనం నిర్మాణపనులు మధ్యలోనే ఆగిపోయాయి. వెంటనే అధికారులు చొరవ తీసుకుని నిధులు విడుదల చేసి భవనం నిర్మాణ పనులు పూర్తి చేయాలి.

– భూక్య చందునాయక్, స్థానికుడు

నల్లబ్యాడ్జీలతో ఉపాధ్యాయుల నిరసన



జనగామ రూరల్: నిరసన తెలుపుతున్న టీచర్లు



స్టేషన్‌ఘన్‌పూర్: ఛాగల్‌లో..

జనగామ రూరల్/స్టేషన్‌ఘన్‌పూర్/పాలకుర్తి/లింగాలఘణపురం/జఫర్‌గఢ్/చిల్పూరు: రంగారెడ్డి జిల్లా మహేశ్వరం మండలం తుక్కుగూడ ఉన్నత పాఠశాలలో సోమవారం ప్రధానోపాధ్యాయుడు రాములుపై దాడికి పాల్పడిన వారిపై చర్యలు తీసుకోవాలని జిల్లాలోని పలు పాఠశాలల్లో టీఎస్ యూటీఎఫ్ ఆధ్వర్యంలో ఉపాధ్యాయులు నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పాఠశాలల్లో ఇలాంటి సంఘటనలు జరగకుండా ప్రభుత్వం చర్యలు చేపట్టాలని కోరారు. టీఎస్ యూటీఎఫ్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు చంద్రశేఖర్‌రావు, వెంకటేశ్, ఉపాధ్యక్షుడు మంగు జయప్రకాశ్, హెచ్‌ఎంలు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

టీజీ సెట్ పోస్టర్ ఆవిష్కరణ



టీజీ సెట్ వాల్ పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే యశస్వినిరెడ్డి, ప్రిన్సిపాల్ తదితరులు

పాలకుర్తి టౌన్: రాష్ట్రంలోని గురుకుల పాఠశాలల్లో 5వ తరగతిలో ప్రవేశాలకు నిర్వహించే టీజీ సెట్ పోస్టర్‌ను ఎమ్మెల్యే మామిడాల యశస్వినిరెడ్డి ఆవిష్కరించారు. సోమవారం మండల కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఆమె వాల్ పోస్టర్‌ను ఆవిష్కరించిన అనంతరం మాట్లాడుతూ విద్యార్థులు ఐదో తరగతిలో చేరేందుకు ప్రభుత్వం నిర్వహిస్తున్న ప్రవేశ పరీక్షకు ప్రతి విద్యార్థి కష్టపడి చదవాలని అన్నారు. ప్రభుత్వం బడుగు, బలహీన వర్గాల విద్యార్థులు చదువుకునేందుకు గురుకులాలను ఏర్పాటు చేసిందన్నారు. విద్యార్థుల చదువు పట్ల తల్లిందడ్రులు ప్రోత్సహించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ సాంఘిక సంక్షేమ బాలికల గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ ఎస్.స్వరూప, టీచర్ కృష్ణవేణి తదితరులు పాల్గొన్నారు.

గణతంత్ర వేడుకలకు పటిష్ట ఏర్పాట్లు

- కలెక్టర్ షేక్ రిజ్వాన్ బాషా

జనగామ రూరల్ : గణతంత్ర వేడుకలు ఘనంగా నిర్వహించేలా పటిష్ట ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ షేక్ రిజ్వాన్ బాషా ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లో అదనపు కలెక్టర్లు పింకేష్‌కుమార్, రోహిత్ సింగ్, డీసీపీ రాజమహేంద్రనాయక్‌తో కలిసి వేడుకల నిర్వహణపై సంబంధిత శాఖల జిల్లా అధికారులతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు. గణతంత్ర దినోత్సవం సందర్భంగా ధర్మకంచ మినీ స్టేడియం, కలెక్టరేట్ పరిసర ప్రాంతాల్లో పారిశుద్ధ్య పనుల నిర్వహణకు చర్యలు చేపట్టాలని, చెత్తాచెదారం, పిచ్చి మొక్కలను తొలగించాలన్నారు. వివిధ శాఖల తరఫున స్టాల్స్‌ను ఏర్పాటు చేయాలని, పుర ప్రముఖులు, అతిథులకు ఆహ్వాన పత్రాలను అందజేయాలని సూచించారు. జిల్లా వ్యాప్తంగా ఉత్తమ సేవలందించిన ఉద్యోగులకు ప్రశంసాపత్రాలు అందించే కార్యక్రమాన్ని ఏఓ పర్యవేక్షించాలని చెప్పారు. జిల్లా ప్రగతిపై రూపొందించే సందేశం కాపీలను సీపీఓ, డీపీఆర్‌ఓ సంయుక్తంగా తయారు చేయాలని పేర్కొన్నారు. ఆరోగ్య శాఖ ఆధ్వర్యాన వైద్య శిబిరం ఏర్పాటు చేయాలని, విద్యుత్ సరఫరా నిరంతరం జరిగేలా విద్యుత్ శాఖ అధికారులు ఇప్పటి నుంచే ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలని అన్నారు. సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వే సమర్థవంతంగా చేపట్టిన ఉత్తమ ఐదు మండలాలను ఎంపిక చేయాలని తెలిపారు. సమావేశంలో ఆర్డీఓ గోపీరాం, ఏఓ మన్సూర్, సీపీఓ పాపయ్య, డీఈఓ రమేష్, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ రిజ్వాన్ బాషా

ఇతర భాషలపై పట్టు సాధించాలి



హిందీ అభ్యాసన దీపికలు అందుకున్న విద్యార్థులతో హెచ్‌ఎం విష్ణు

- హెచ్‌ఎం విష్ణు

దేవరుప్పుల: విద్యార్థులు భవిష్యత్ కోసం ఉద్యోగ, ఉపాధి అవకాశాలు మెరుగుపర్చుకునేందుకు ఇతరతర బాషాలపై పట్టు సాధించాలని హెచ్‌ఎం విష్ణు సూచించారు. సోమవారం మండలంలోని కోలుకొండ హైస్కూల్‌లో జిల్లా కలెక్టర్, డీఈఓల సౌజన్యంతో రూపొందించిన హిందీ అభ్యాసన దీపికలను పదో తరగతి విద్యార్థులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇతరతర దేశాలు, రాష్ట్రాల్లో ఎక్కడకు వెళ్లి జీవించాలన్నా అంగ్లం, హిందీ భాష అనివార్యమైందన్నారు. ఏ భాషాలోనైనా అక్షరమాల, వ్యాకరణంపై దృష్టి సారిస్తే ఆ బాషా సులభతరంగా వస్తుందన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు వెంకన్న, హరీశ్, శంకర్, సునిత, ఇందిర, ఆంజనేయులు, శ్రీనివాస్, శోభరాణి, కిరణ్, మాధవరావు పాల్గొన్నారు.

సాగుచేయని భూములు గుర్తించండి

- కార్డుల జారీ నిరంతర ప్రక్రియ
- అదనపు కలెక్టర్ రోహిత్‌సింగ్



బచ్చన్నపేట: అధికారులతో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ రోహిత్‌సింగ్

నర్మెట/బచ్చన్నపేట/తరిగొప్పుల: సాగు చేయని, సాగుకు యోగ్యంగా కాని భూముల గుర్తింపు ప్రక్రియను త్వరితగతిన పూర్తిచేయాలని, రేషన్ కార్డుల ప్రక్రియ నిరంతరం కొనసాగుతుందని అదనపు కలెక్టర్ రోహిత్ సింగ్ (రెవెన్యూ) అన్నారు. నర్మెట మండల తహసీల్దార్ కార్యాలయ తనిఖీ, బచ్చన్నపేట మండలంలోని కొడవటూర్, తరిగొప్పులలో చేపట్టిన సర్వేను ఆయన గురువారం పరిశీలించి మాట్లాడారు. నాన్ అగ్రికల్చర్ భూముల వివరాలు, రేషన్ కార్డుల సర్వేవివరాలు అధికారులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ప్రధాన నర్మెట రహదారి వెంట ఉన్న లేఅవుట్ భూములను, అమ్మాపురంలోని ఇటుక బట్టీలు నిర్వహిస్తున్న ప్రదేశాలను పరిశీలించి వివరాలు తెలుసుకున్నారు. ఆయన వెంట తహసీల్దార్లు కలకుంట్ల వెంకట రామానుజా చార్యులు, ప్రకాశ్‌రావు, నాగేశ్వరాచారి, ఎంపీడీఓలు అరవింద్ చౌదరి, మల్లికార్జున్ ఆర్‌ఐలు సింగారం సాయి బాబ, రవీందర్, ఏఓ బూర మమత, ఏఈఓ కన్నయ్య, అబ్బయ్య, జీపీ సిబ్బంది పాల్గొన్నారు.

సాగరంలో రైతు భరోసాపై సర్వే

జఫర్‌గఢ్: మండలంలోని సాగరం గ్రామంలో వ్యవసాయ, రెవెన్యూ అధికారులు రైతు భరోసా సర్వేను నిర్వహించారు. ఈ సందర్భంగా మండల వ్యవసాయ అధికారి కరుణాకర్‌రెడ్డి మాట్లాడుతూ రైతు భరోసా పథకానికి అర్హులైన రైతులను ఎంపిక చేసేందుకు గ్రామాల్లో సర్వే నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ సర్వే ద్వారా సాగుకు యోగ్యం కాని భూములను గుర్తిస్తున్నట్లు పేర్కొన్నారు. సీనియర్ అర్జున్, ఆర్‌ఐ అనిల్‌బాబు, ఏఈఓ ప్రశాంత్ సిబ్బంది పాల్గొన్నారు.

మహాధర్నాను జయప్రదం చేయాలి

- బీఎస్‌ఆర్‌కేఎస్ రాష్ట్ర కోశాధికారి మధు



వాల్ పోస్టర్లను ఆవిష్కరిస్తున్న నాయకులు

స్టేషన్‌ఘన్‌పూర్: ఫిబ్రవరి 3న హైదరాబాద్‌లో నిర్వహించనున్న బీఎస్‌ఆర్‌కేఎస్ మహాధర్నాకు భవన నిర్మాణ రంగాల కార్మికులు అధిక సంఖ్యలో హాజరై జయప్రదం చేయాలని బీఎస్‌ఆర్‌కేఎస్ రాష్ట్ర కోశాధికారి తాటికొండ మధు పిలుపునిచ్చారు. బీఎస్‌ఆర్‌కేఎస్ ఆధ్వర్యంలో ఫిబ్రవరి 3న నిర్వహించనున్న మహాధర్నాకు సంబంధించిన పోస్టర్లను ఘన్‌పూర్ డివిజన్ కేంద్రంలో సోమవారం ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా బీఎస్‌ఆర్‌కేఎస్ మండల అధ్యక్షుడు పండుగ రాజు అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో మధు మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం భవన నిర్మాణ రంగాల కార్మికులపై సానుకూలంగా స్పందించాలని కోరారు. సంక్షేమ పథకాల పనులను ప్రైవేట్ ఇన్స్యూ కంపెనీలకు ఇవ్వవద్దని, పెండింగ్‌లో ఉన్న క్లైయిమ్‌లు వెంటనే క్లియర్ చేయాలని, 55 సంవత్సరాల వయస్సు నిండిన కార్మికులకు పెన్షన్ అందించాలని ఆయన డిమాండ్ చేశారు. సంఘం మండల కోశాధికారి పొన్నకంటి బాబు, కార్యదర్శులు చెరిపెల్లి రాజు, గాదె ఆదాం, సమ్మయ్య, నాయకులు తిరుపతి, రమేష్, ఏలియా, శివ పాల్గొన్నారు.

విద్యారంగ పరిరక్షణకు యూటీఎఫ్ కృషి



జఫర్‌గఢ్: క్యాలెండర్లను ఆవిష్కరిస్తున్న జయప్రకాశ్ తదితరులు

- టీఎస్ యూటీఎఫ్ జిల్లా ఉపాధ్యక్షుడు జయప్రకాశ్

జఫర్‌గఢ్/పాలకుర్తి టౌన్: ఉపాధ్యాయుల సంక్షేమంతో పాటు విద్యారంగ పరిరక్షణకు యూటీఎఫ్ చిత్తశుద్ధితో కృషి చేస్తుందని టీఎస్ యూటీఎఫ్ జిల్లా ఉపాధ్యక్షుడు మంగు జయప్రకాశ్ అన్నారు. సంఘం ఆధ్వర్యంలో మండలంలోని హిమ్మత్‌నగర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో నాయకులు, ఉపాధ్యాయులతో కలిసి ఆయన నూతన సంవత్సర క్యాలెండర్లను సోమవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. విద్యారంగంలో నెలకొన్న సమస్యల పరిష్కారం కోసం యూటీఎఫ్ అనేక పోరాటాలు నిర్వహించడం జరిగిందన్నారు. యూటీఎఫ్ మండల శాఖ అధ్యక్షులు బూక్య వంశీకృష్ణ, ఉపాధ్యాయులు కడారి వసంత, గాదె వెంకటస్వామి, పారిక మంజుల తదితరులు పాల్గొన్నారు. అలాగే పాలకుర్తి ఎమ్మార్సీ భవనంలో ఎంఈఓ పోతుగంటి నర్సయ్య టీఎస్ యూటీఎఫ్ క్యాలెండర్, డైరీని ఆవిష్కరించి మాట్లాడారు. పెండింగ్‌లో ఉన్న డీఏలు, పాతబకాయిలు విడుదల చేయాలని అన్నారు. యూటీఎఫ్ నాయకులు చిదురాల రమేష్, హేమలత, వెంకటేశం, మధు, బలరాం తదితరులుపాల్గొన్నారు.

సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి

- స్టేషన్‌ఘన్‌పూర్ ఏసీపీ భీంశర్మ



రఘునాథపల్లి: సైబర్ నేరాల విషయంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని స్టేషన్‌ఘన్‌పూర్ ఏసీపీ భీంశర్మ అన్నారు. సోమవారం రాత్రి కంచనపల్లిలో రఘునాథపల్లి పోలీసుల ఆధ్వర్యాన కార్డెన్‌సెర్చ్ నిర్వహించి సరైన పత్రాలు లేని 14 వాహనాలను స్వాధీనం చేసుకున్నారు. ఈ సందర్భంగా ఏసీపీ మాట్లాడుతూ ఈకేవైసీ, ఆధార్ అప్‌డేట్, బ్యాంక్ కాల్స్ అంటూ అపరిచితుల నుంచి వచ్చే కాల్స్, మెసేజ్‌లకు స్పందించొద్దని, ఓటీపీ, ఎలాంటి సమాచారం ఇవ్వకూడదని పేర్కొన్నారు. ఎవరైనా సైబర్ బారిన పడితే వెంటనే 1930 టోల్ ఫ్రీ నంబర్‌కు ఫిర్యాదు చేయాలని సూచించారు. అనుమానాస్పద వ్యక్తులు కనిపిస్తే 100 నంబర్‌కు సమాచారం ఇవ్వాలని సూచించారు. సీఐలు ఎడవెల్లి శ్రీనివాస్‌రెడ్డి, వేణు, ఎస్సైలు దూదిమెట్ల నరేష్, బండి శ్రవణ్‌కుమార్, నవీన్ పాల్గొన్నారు.

గీత కార్మికులకు ఇచ్చిన హామీ నెరవేర్చాలి

- కేజీకేఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి వెంకటమల్లయ్య



ధర్నా చేస్తున్న కేజీకేఎస్ నాయకులు

జనగామ రూరల్: కల్లుగీత కార్మికులకు ప్రభుత్వం ఇచ్చిన హామీలు వెంటనే అమలు చేయాలని కేజీకేఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి బాల్నె వెంకటమల్లయ్య డిమాండ్ చేశారు. సోమవారం కలెక్టరేట్ వద్ద ధర్నా చేపట్టి వినతి పత్రం అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. జిల్లాలో 28,000 కుటుంబాలు గీత వృత్తిపై ఆధారపడి జీవిస్తున్నాయని, వృత్తిలో ప్రమాదాలు జరుగుతున్నా బతుకు దెరువు కోసం కొనసాగితున్నట్లు పేర్కొన్నారు. ప్రమాదాల నివారణకు కాటమయ్య రక్షణ కవచం పేరుతో ప్రభుత్వం ఇస్తున్న సేఫ్టీ కిట్లు ఉపయోగకరంగా ఉందని, జిల్లాలో 10,500 మంది సభ్యత్వం కలిగిన వారు ఉంటే 600 మందికి మాత్రమే ఇచ్చారని ఆరోపించారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు కుర్ర ఉప్పలయ్య, కనకటి రాజయ్య, కమ్మగాని నాగన్న, శ్రీనివాస్, వెంకటేష్, మహేందర్, కొండయ్య, రాజు, రమేష్, ప్రవీణ్, శంకరయ్య, అయోధ్య, బుర్ర ఆంజనేయులు పాల్గొన్నారు.

బడీడు పిల్లలు బడిలోనే ఉండాలి



కొడకండ్ల: ఇటుక బట్టీల వద్ద సర్వే చేస్తున్న సీఆర్పీ జ్ఞానానందం

కొడకండ్ల: ఆర్‌టీఈ చట్టం ప్రకారం బడీడు పిల్లలంతా బడిలోనే ఉండాలని సీఆర్పీ జవ్వాజి జ్ఞానానందం అన్నారు. సోమవారం కొడకండ్ల క్లస్టర్ పరిధిలోని హక్యాతండ శివారులోని ఇటుక బట్టీల వద్ద సర్వే నిర్వహించి కోదాడ నుంచి జీవనోపాధి నిమిత్తం వలస వచ్చిన కుటుంబాలకు చెందిన ముగ్గురు పిల్లలను గుర్తించి సమీపంలోని తండా ప్రాథమిక పాఠశాలలో చేర్పించారు.

బడిబయట పిల్లల గుర్తింపు సర్వే

జఫర్‌గఢ్: మండలంలో బడి బయట ఉన్న పిల్లలను గుర్తించి వారిని బడిలో చేర్పించేందుకు రిసోర్స్ పర్సన్స్ ఆధ్వర్యంలో చేపట్టిన సర్వే కొనసాగుతోంది. సోమవారం తిమ్మంపేట, మగ్దుంతండా గ్రామాల్లో సర్వే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మండల ఇన్‌చార్జ్, ఎంఈఓ రఘునందన్ మాట్లాడుతూ బడీడు పిల్లలు బడిలో ఉండేందుకు ప్రభుత్వం బడి బయట ఉన్న వారి ఇంటింటా సర్వే కార్యక్రమాన్ని నిర్వహించడం జరుగుతున్నదన్నారు. సర్వే 26వ తేదీ వరకు కొనసాగుతుందన్నారు. బడిబయట ఉన్న పిల్లలను తప్పనిసరిగా బడిలో చేర్పించి వారి విద్యాభివృద్ధికి అందరూ తోడ్పడాలన్నారు. సీఆర్పీలు పుట్ట స్వామి, బాబు తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి గ్రామసభలు

బచ్చన్నపేట/పాలకుర్తి/దేవరుప్పుల: ప్రభుత్వ పథకాల అమలుకు గ్రామాల్లో నేటి(మంగళవారం) నుంచి 24వ తేదీవరకు గ్రామ సభలు నిర్వహించనునున్నట్లు ఎంపీడీఓలు మల్లికార్జున్, రాములు, కె.లక్ష్మీనారాయణ, తహసీల్దార్ శ్రీనివాస్ తెలిపారు. సోమవారం వారు బచ్చన్నపేట, పాలకుర్తి, దేవరుప్పులలో వేర్వేరుగా మాట్లాడారు. కొత్త దరఖాస్తుల స్వీకరణ, రేషన్‌కార్డులు, రైతు భరోసా, ఇందిరమ్మ ఇళ్లు, ఆత్మీయ భరోసా పథకాలపై గ్రామ సభలు నిర్వహించనున్నట్లు చెప్పారు. లబ్ధిదారుల ఎంపిక అనేది నిరంతరం కొనసాగుతుందన్నారు.

నియామకం

స్టేషన్‌ఘన్‌పూర్: బీజేపీ మండల అధ్యక్షుడిగా సల్ల వెంకటరమణగౌడ్ నియమితులయ్యారు. ఈ మేరకు సోమవారం జిల్లా కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో జిల్లా అధ్యక్షుడు ఆరుట్ల దశమంతరెడ్డి చేతుల మీదుగా నియామక పత్రాన్ని అందుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తనపై నమ్మకంతో అధ్యక్ష బాధ్యతలు అప్పగించినందున కార్యకర్తలకు అందుబాటులో ఉంటూ పార్టీని మరింత బలోపేతం చేస్తానని అన్నారు. తనకు పదవి ఇచ్చిన జిల్లా అధ్యక్షుడు దశమంత్‌రెడ్డి, నాయకులు గుండె విజయరామారావు, ఉడుగుల రమేశ్, పెరుమాండ్ల వెంకటేశ్వర్లు, సౌడ రమేశ్, శివరాజ్, యుగందర్‌రెడ్డి, అంజిరెడ్డి, ప్రదీప్, లక్ష్మి, వెంకట్‌రెడ్డి, శరత్, విస్టులకు ప్రత్యేక కతజ్ఞతలు తెలిపారు.

'భూమి కబ్జా కాకుండా చూడండి'

బచ్చన్నపేట: మండలంలోని పోచన్నపేట గ్రామ పరిధిలో సర్వే నంబర్ 528లో ఉన్న భూమిని కబ్జాదారుల నుంచి కాపాడాలని రెవెన్యూ అధికారులకు విన్నవించినా పట్టించుకోవడం లేదని గ్రామానికి చెందిన నల్ల శ్రావణ్‌కుమార్ ఆవేదన వ్యక్తం చేశారు. సోమవారం ఆయన బచ్చన్నపేటలో మాట్లాడుతూ ఈ విషయం తహసీల్దార్ దృష్టికి తీసుకెళ్లగా పట్టించుకోవడం మానేసి తనపై అసభ్య పదాలతో దూషించడంతో స్థానిక పోలీస్‌స్టేషన్ ఫిర్యాదు చేశానన్నారు. ఈ విషయమై తహసీల్దార్ ప్రకాశ్‌రావును వివరణ కోరగా శ్రావణ్‌కుమార్ వినతి పత్రం ఇవ్వగా భూమికి సంబంధించిన సర్వే నంబర్లలో ఉన్న వారందరికి నోటీసులు ఇచ్చి సమస్య పరిష్కారానికి కృషి చేస్తానని చెప్పానని, కులం పేరుతో ఎలాంటి దూషణలు చేయలేదన్నారు. ఈ విషయాన్ని జిల్లా అధికారుల దృష్టికి తీసుకెళ్తానని తెలిపారు.

ధర్నాను జయప్రదం చేయండి

లింగాలఘణపురం: ఈ నెల 22వ తేదీన మండల కేంద్రంలో జరిగే రైతు మహాధర్నాను జయప్రదం చేయాలని బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు బస్వగాని శ్రీనివాసు కోరారు. సోమవారం మండల కేంద్రంలో విలేకరులతో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ రైతులకు ఇచ్చిన హామీలను అమలు చేయకుండా మోసం చేస్తుందన్నారు. యాదగిరి, శేఖర్, వీరయ్య, రవి, కరుణాకర్, రాహుల్ పాల్గొన్నారు.


పశువైద్య శిబిరాలను వినియోగించుకోవాలి

జఫర్‌గఢ్: గ్రామాల్లో నిర్వహిస్తున్న ఉచిత పశువైద్య

సంక్షిప్త సమాచారం

శిబిరాలను రైతులు వినియోగించుకోవాలని మండల పశువైద్యాధికారి సీహెచ్ రజిత, ఉప్పుగల్లు పశువైద్యాధికారి శ్రీనాథ్ సూచించారు. పశుసంవర్ధక, పశు గణాభివృద్ధిశాఖ ఆధ్వర్యంలో మండలంలోని ఓబులాపూర్ గ్రామంలో పశువైద్య శిబిరాన్ని సోమవారం నిర్వహించారు. రాజేశ్వర్‌రావు, రాజు, నగేష్, లచ్చయ్య, గోపాల్, దివ్య పాల్గొన్నారు.

ప్రమాదవశాత్తు పూరి గుడిసె దగ్ధం



కొడకండ్ల: గ్యాస్ సిలిండర్ లీకై పూరి గుడిసె దగ్ధమైన సంఘటన సోమవారం రంగాపురం గ్రామంలో చోటు చేసుకుంది. గ్రామానికి చెందిన సోమారపు అశోక్‌మమత దంపతులు పక్కా ఇల్లు లేక పూరి గుడిసెలో నివసిస్తున్నారు. కూలీ పనుల కోసం ఇద్దరు వెళ్లగా గ్యాస్ లీకై మంటలు వ్యాపించి గుడిసెకు అంటుకుని పూర్తిగా కాలిపోయింది. ఈ ప్రమాదంలో మహిళా సంఘం నుంచి తెచ్చుకున్న రూ.50వేల నగదుతో పాటు బయట అప్పుగా తెచ్చిన రూ. 50 వేలు, మొత్తం రూ.లక్ష నగదుతో పాటు బంగారం, వస్తు సామగ్రి, విలువైన కాగితాలు అన్ని కాలిపోయినట్లు బాధితులు ఆవేదన వ్యక్తం చేశారు. నిరుపేద దళిత కుటుంబం ఈ ప్రమాదంతో కట్టుబట్టలు మినహా సర్వం కోల్పోయింది.

హామీని అమలుచేయాలి

బచ్చన్నపేట: సీఎం రేవంత్‌రెడ్డి ఇచ్చిన ఎస్సీ వర్గీకరణ హామీని అమలుచేయాలని ఎమ్మార్పీఎస్ జిల్లా కార్యదర్శి పాకాల కుమారస్వామి అన్నారు. సోమవారం మండలంలోని లింగంపల్లిలో గ్రామ నాయకుడు బొడ్డు నవీన్ అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఫిబ్రవరి 7వ తేదీన చేపట్టనున్న వేయి గొంతుకలు–లక్ష డప్పులు కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. నాయకులు అజయ్, వెంకటేష్ పాల్గొన్నారు.

మహాసభలను విజయవంతం చేయాలి

జఫర్‌గఢ్: సంగారెడ్డిలో నిర్వహించనున్న సీపీఎం రాష్ట్ర మహాసభలను విజయవంతం చేయాలని ఆ పార్టీ గ్రామ కార్యదర్శి వడ్లకొండ సుధాకర్ పిలుపునిచ్చారు. ఈ మేరకు మండలంలోని తమ్మడపల్లి(జి)లో ఆయన నాయకులతో కలిసి మహాసభల వాల్ పోస్టర్లను సోమవారం ఆవిష్కరించారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా కమిటీ సభ్యురాలు ఎండీ షబానా, గ్రామ నాయకులు వేల్పుల రవి, పెద్ద రాములు, చిలువేరు మల్లేశ్, నక్క యాకయ్య, నాగరాజు, యాకన్న, రజిత, ఎండీ శంషోద్దీన్, అన్నెపు ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

కార్మికులు పోరాటాలకు సిద్ధం కావాలి

లింగాలఘణపురం: భవన నిర్మాణ కార్మికుల సమస్యలను పరిష్కరించుకొనేందుకు కార్మికులంతా పోరాటాలకు సిద్ధం కావాలని భవన నిర్మాణ కార్మిక సంఘం రాష్ట్ర కార్యదర్శి రాసమల్ల కొంరయ్య అన్నారు. సోమవారం మండల కేంద్రంలో ఆ సంఘం మండల అధ్యక్షుడు జాగిళ్లపురం రమేశ్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడుతూ కార్మికుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు దరిపల్లి చంద్రన్న పిలుపు మేరకు ఈ నెల 31న హైదరాబాద్‌లో లేబర్ కమిషనర్‌కు వినతిపత్రం సమర్పించేందుకు మండలంలోని అన్ని గ్రామాల కార్మికులు హాజరు కావాలని కోరారు. జిల్లా అధ్యక్షుడు అంజయ్య, రాములు, భిక్షపతి పాల్గొన్నారు.